మొండి బకాయిల్లో మతలబు

- రెన్యువల్ కాని ట్రేడ్ లైసెన్స్‌లు
- అధికారులకు దొరకని చిరునామాలు
- పేరుకున్న బకాయిలు
- మునిసిపాలిటీ అభివృద్ధికి అడ్డంకి


తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం

తాడిపత్రి రూరల్: మునిసిపాలిటీ ఆర్థికాభివృద్ధికి ట్రేడ్ లైసెన్స్‌ల మొండి బకాయిలు అడ్డంకిగా మారాయి. బకాయిల చెల్లింపుపై పలు మార్లు అధికారులు నోటీసులు జారీ చేసినా వ్యాపారులు స్పందించడం లేదని అధికారులు పేర్కొన్నారు. అధికారుల అంచనాల ప్రకారం రూ. 5 లక్షలకు పైగా బకాయిలు ఉన్నాయి. వీటి వసుళ్లపై సిబ్బందితో టీంను ఏర్పాటు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. సాధారణంగా మునిసిపాలిటీ పరిధిలో ఏ వ్యాపారం చేయాలన్నా అధికారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందే. అధికారుల లెక్కల ప్రకారం హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, దాబాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, వాహనాల డీలర్లు, స్కూళ్లు, తదితర నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. మునిసిపాలిటీలో దాదాపు 2243 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.21.57లక్షలకు గానూ రూ.16.13లక్షలు వసులైంది. ఇంకా రూ.5.44లక్షలు పెండింగ్‌లో ఉంది.

రెన్యువల్ కానీ 473 ట్రేడ్ లైసెన్స్‌లు

మునిసిపాలిటీ పరిధిలో 473 ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ కాలేదు. సచివాలయ సెక్రటరీల ద్వారా వార్డు పరిధిల్లో ఉన్న వారికి ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ కోసం నోటీసులు జారీ చేశారు. కానీ ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి ఎక్కువ అడ్రస్సులు ట్రేస్ అవుట్ కాలేదని సెక్రటరీలు తెలపడంతో అధికారులు నివ్వెరపోతున్నారు. మునిసిపాలిటీ పరిధిలో అడ్రసులు ట్రేస్ అవుట్ కాలేదంటే ఇందులో ఏదో మతలబు ఉందని అధికారులు గ్రహించి స్వయంగా సచివాలయ సెక్రటరీతో కలిసి వెళ్లాలని మునిసిపల్ సిబ్బందికి ఆదేశించడంతో పలు అసక్తి కరమైన విషయాలు బయట పడ్డాయని తెలుస్తోంది. గతంలో శానిటరీ శాఖలో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారి వల్ల ట్రేడ్ లైసెన్స్‌ల్లో మతలబు జరిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారని సమాచారం. అప్పట్లో ట్రేడ్ లైసెన్స్‌ల కోసం కొందరు వ్యాపారల నుంచి డబ్బు వసులు చేసి మునిసిపాలిటీలో జమ చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉదంతంతో అప్పట్లో శానిటరీ శాఖలో జరిగిన పలు లావాదేవీలపై కూడా విచారణ జరపడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. బదిలీపై వెళ్లిన అధికారిపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఆయనను తాడిపత్రికి పిలిపించి ట్రేడ్ లైసెన్స్‌ల్లో జరిగిన మతలబుపై విచారణ జరపడానికి కూడా సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.

మద్యం షాపుల ట్రేడ్ లైసెన్స్‌ల పెండింగ్ బకాయిలు

గతంలో తాడిపత్రిలో ఏర్పాటు చేసిన మద్యం షాపుల ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిలు కూడా ఎక్కువగా ఉన్నాయి. 2014-19 మధ్య టీడీపీ హయాంలో తాడిపత్రిలో మద్యం షాపులను ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రైవేట్ వ్యక్తులు లైసెన్స్‌లను దక్కించుకున్నారు. మద్యం షాపులకు సంబంధించి ప్రస్తుతం ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిల రెన్యువల్ లిస్టులో ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. 2019-24 మధ్య ప్రభుత్వ హయాంలో మద్యం షాపుల నిర్వహణ జరిగింది. కానీ 2019కి ముందు ఉన్న మద్యం షాపుల నిర్వాహకుల్లో పలువురు ఇప్పటికీ రెన్యువల్ బకాయిలు చెల్లించలేదని అధికారులు నోటీసులు పంపడంతో లబోదిబోమంటున్నారు. అప్పట్లో బకాయిలు చెల్లించామని అధికారులతో వాపోతున్నారు. ఒకవేళ బకాయిలు చెల్లించకుంటే ఇన్నాళ్లు నోటీసులు ఇవ్వకుండా ఇప్పుడు ఎందుకు ఇస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో శానిటరీ శాఖలో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారి నిర్వాకం వల్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికీ పలు వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లు వేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో వీటి ద్వారా అక్రమంగా డబ్బులు వసులు చేసి వదిలి పెట్టారు. ఇలాంటి వాటిని సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరిపి ట్రేడ్ లైసెన్స్‌లను కట్టించే ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.

బకాయిలు వసూలు చేస్తాం



ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిల్లో పైసా కూడా వదిలిపెట్టకుండా వసులు చేస్తాం. పెండింగ్‌లోని రెన్యువల్స్‌లో జరుగుతున్న జాప్యంపై దృష్టి పెడుతాం. ట్రేడ్ లైసెన్స్‌దారులకు పెండింగ్ బకాయిలు, రెన్యువల్స్‌పై నోటీసులు జారీ చేశాం. సచివాలయ సిబ్బంది ద్వారా వసూళ్లను వేగవంతం చేస్తాం.
– శివరామక్రిష్ణ, కమిషనర్, తాడిపత్రి

'వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి'

శింగనమల: శింగనమల రంగరాయుల చెరువు కింద శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, శివపురం, సీ.బండమీదపల్లి, పోతురాజుకాల్వ గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం శింగనమలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడారు. శింగనమల చెరువు కింద రైతులు దాదాపు 1,000 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారన్నారు. మార్కెట్‌లో వరిధాన్యానికి గిట్టు బాటు ధర లేదని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని వారు కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

తాడిపత్రి: మండలంలోని బొందలదిన్నె, రావి వెంకటాంపల్లి గ్రామాల్లో ఆదివారం ఎమ్మార్పీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద కృష్ణయ్య మాదిగ ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణానికి చెందిన షబానా ఆప్టికల్స్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బొందలదిన్నెలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి 60 మంది హాజరుకాగా అందులో కంటి శస్త్ర చికిత్సల కోసం 10 మంది ఎంపికయ్యారు. అలాగే రావి వెంకటాంపల్లి గ్రామంలో కంటి శిబిరానికి 100 మంది హాజరుకాగా, అందులో 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యురాలు కోమలి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి, నంద్యాల జిల్లా కేంద్రంలో ఉన్న శాంతిరాం ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు మంద కృష్ణయ్య మాదిగ తెలిపారు.

క్లుప్తంగా

దళిత కాలనీలో తాగునీటి సమస్య


ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు

యాడికి: మండలంలోని పిన్నేపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొనడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి అధికారులు రోజు విడిచి రోజు పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నా దళిత కాలనీకి నీరు చేరడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు వాపోయారు. సమాచారం అందుకున్న తూట్రాళ్లపల్లి సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు సొంత నిధులతో కాలనీకి ట్యాంకర్ల ద్వారా నీరందించారు. దీంతో కాలనీ వాసులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుణ్యవతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మూగ జీవాలకు నీటి తొట్టెల ఏర్పాటు


గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నీటి తొట్టె ఏర్పాటు చేసిన దృశ్యం

గుత్తి: మూగజీవాల దహార్తిని తీర్చడానికి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆదివారం నీటి తొట్టెలు ఏర్పాటు చేయించారు. పట్టణంలోని రాయల్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్, కర్నూల్ రోడ్డు, అనంతపురం రోడ్డులో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్పందించి ఇళ్లు, దుకాణాలు, హోటళ్ల ఎదుట మూగ జీవాల కోసం తొట్టెలు ఏర్పాటు చేయడం లేదా నీరు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంతువులు, పక్షులకు నీటి సదుపాయం కల్పించాలని ఆయన సూచించారు.

గరుగుచింతలపల్లిలో నాకాబందీ

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లిలో ఆదివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని వివాదాస్పద వ్యక్తులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. చిన్న చిన్న సమస్యలకు ఘర్షణలకు దిగరాదని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట నరసింహ హెచ్చరించారు.

బెల్లపు ఊట ధ్వంసం


నాటు నారాతోపాటు బెల్లం సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

గుంతకల్లు: గుంతకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుండాల తండాలో సారా తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, బెల్లం సరఫరా చేసిన వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివసాగర్ తెలిపారు.వివరాలు.. మండలంలోని గుండాలతాండా పరిసరాల్లో నాటు సారా తయారుచేస్తున్నారన్నా సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. దాదాపు 375 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతోపాటు 20 లీటర్లు నాటు సారాతోపాటు 110 కేజీల బెల్లం సీజ్ చేయడంతోపాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే బెల్లం సరఫరా చేసిన వ్యాపారిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ వెంకటేశం, హెడ్ కానిస్టేబుళ్లు గోపాల్‌నాయక్, ఫకురన్న, వెంకటేష్, ఈసీలు బాబ్లిశామ్యూల్, సురేష్, నాగరాజు, సుగణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు గ్రామం వద్ద పెన్నానదిపై నూతనంగా నిర్మించిన రహదారి పనులు అసంపూర్తి గా ఉండటంతో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పీజీఆర్ఎస్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తుల కొండయ్య ఇటీవల వినతి పత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ సంబందిత శాఖ అధికారులను ఆదేశించడంతో రెండు రోజులుగా రోడ్డు పనులు చేస్తున్నారు. ఆ శాఖ అధికారులు సమస్య పరిష్కారం అయినట్లుగా ఫిర్యాదుదారుడిని కలిశారు. కాగా రహదారి సమస్యను త్వరగా పరిష్కరించినందుకు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

గుంతకల్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 44 లక్షల మంది హమాలీల కోసం ప్రభుత్వం హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుంతకల్లప్ప ఫంక్షన్ హాల్‌లో ఏఐటీయూసీ అనుబంధం సంఘమైన అనంతపురం జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వీకే కృష్ణుడు హాజరై మాట్లాడారు. హమాలీల సంఘం ఏర్పడి దాదాపు 45 ఏళ్లు గడుస్తున్నా.. వారి జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. వారి దుస్థితి గ్రహించి ప్రభుత్వం ప్రత్యేక హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, సురేష్, సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాముడు, రాయల్, కుళ్లాయిస్వామి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో గాలివాన బీభత్సం


దుకాణంపై పడ్డ చెట్టు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఆదివారం రాత్రి వీచిన గాలి ఉధృతికి రోడ్డుపై ఉన్న చెట్టు కూకటి వేళ్లతో సహా దుకాణంపై పడింది. ఈ సమయంలో దుకాణం బయట ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో పెద్ద ఎత్తున గాలులు వీచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాలి ఉధృతి కారణంగా పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

టెంకాయ చెట్టుపై పిడుగు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఆదివారం టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గ్రామంలో ఓ వ్యవసాయ తోటలో టెంకాయ చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. అనంతరం చెట్టు కూలిపోయింది. అయితే ఆసమయంలో చెట్టు వద్ద ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

పామిడిలో వర్షం

పామిడి: పామిడిలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి భూమి ఉపరితలం చల్లబడింది. దీంతో ప్రజలు వేసవితాపం నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు డాబా ఇళ్ల రేకులు ఎగిసిపడ్డాయి. విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు



ముసలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ముసలమ్మ తల్లి దేవాలయం, పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కోటంకలో..



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'ఆర్డీటీని రక్షించుకుందాం'

గార్లదిన్నె: ఆర్డీటీని రక్షించుకుందామని అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ మెంబర్ లోలూరు కుళ్లాయప్ప అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కరువు పీడత అనంతపురం జిల్లా అభివృద్ధికి, ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజల అభ్యున్నతికి , గ్రామీణ ప్రాంతాల్లో విద్య,ఉద్యోగ, ఉచిత ఇళ్ల నిర్మాణం, పేద విద్యార్థులను కార్పొరేట్ కళాశాలలో చదివించడం, మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి పరచడం వంటి పనులు చేస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటర్ యాక్ట్ అనుమతులు రద్దు చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటర్ యాక్ట్ అనుమతులు పునరుద్ధరించాలన్నారు.

'ప్రాణహాని ఉందన్నా పట్టించుకోలేదు'

గుంతకల్లుటౌన్: ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణకు ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉందని, అతనికి భద్రత కల్పించాలని కోరినా పోలీసు ఉన్నతాధికారులు స్పందించలేదని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి అక్కులప్ప, ఆలూరు ఇన్‌చార్జి రామాంజనేయులు, స్థానిక నేత మహేంద్రలు ఆరోపించారు. లక్ష్మీనారాయణ ఇంటి వద్ద గతంలో ఉన్న పోలీసు పికెటింగ్‌ను కూడా ఎత్తివేయించారని, ఈ విషయమై పత్తికొండ డీఎస్పీని కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, ఆయనపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే దాకా రాస్తారోకోను విరమించేది లేదని స్థానిక ఎమ్మార్పీఎస్ ఆనంద్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. డీఎస్పీ శ్రీనివాసులు స్పందించి జిల్లా ఎస్పీ జగదీష్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. అయినప్పటికీ వారు ఆందోళన విరమించకపోవడంతో నేరుగా ఎస్పీ ఆందోళనకారుల వద్దకు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సంఘాల నేతలు ఆనంద్, జన్నేమస్తాన్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులాస్పత్రి వద్ద ప్రమాదకరంగా గొయ్యి


గొయ్యిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి రూరల్: స్థానిక పశువుల ఆస్పత్రి ప్రధాన గేట్ వద్ద పైప్ లైన్ కోసం తవ్విన గొయ్యి ప్రమాదకరంగా మారిందని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి మండిపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను మద్దతుదారులతో కలసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోజూ పట్టణ, మండలంలోని పలు గ్రామాల నుంచి బర్రెలు, ఆవులు, ఎద్దులను చికిత్స కోసం రైతులు ఆస్పత్రికి తీసుకువస్తారన్నారు. అయితే ఆస్పత్రి గేట్ వద్ద పెద్ద గొయ్యి ఉండడంతో.. జీవాలు ప్రమాదవశాత్తు అందులో పడితే అంతే సంగతులన్నారు. గొయ్యిని పూడ్చాలని మార్లు మునిసిపల్ కమిషనర్ , వెటర్నరీ డాక్టర్ తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కమిషనర్ స్పందించి గొయ్యిని పూడ్చి వేయించకుంటే రైతుల తరపున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు సూరి, అబ్రహం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

లారీ, బొలెరో ఢీ .. ఇద్దరికి గాయాలు


లారీ - బొలెరో ఢీ కొన్న దృశ్యం

తాడిపత్రి: మండలంలోని తాడిపత్రి - భోగసముద్రం ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం లారీ - బొలెరో ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. భోగసముద్రం గ్రామానికి చెందిన గంగాధర్ తన భార్య శ్రీ లక్ష్మి, కుమారుడు హేమంత్ కుమార్‌తో కలసి బొలెరో వాహనంలో తాడిపత్రికి బయలుదేరాడు. గదరగుట్టపల్లి వద్దకు రాగానే ముందు వైపు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా కుడివైపుకు తిరిగింది. దీంతో వెనుక వైపు వస్తున్న బొలెరో లారీని ఢీ కొంది. ప్రమాదంలో శ్రీ లక్ష్మికి స్వల్పగాయాలవగా, హేమంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కటింగ్ మిషన్ తగిలి వ్యక్తికి గాయాలు


గాయపడిన దస్తగిరి

తాడిపత్రి: చెట్టును కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రంపం కటింగ్ మిషన్ తగిలి దస్తగిరి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని బ్రాహ్మణపల్లిలో రైతు పాపిరెడ్డి తోటలో మునగచెట్లను ఆదివారం రంపం కటింగ్ మిషన్‌తో కట్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రంపం కటింగ్ మిషన్ జారిపోయి కాలు, చేయి, మెడకు తగలడంతో దస్తగిరి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం, అక్కడ నుంచి బెంగుళూరుకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: మండలంలోని చిక్కేపల్లిలో మొక్కజొన్న పంట దిగుబడి పూర్తయిన రైతులు ఆదివారం తమ పొలంలోని చెత్తను అంటించగా పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీ ఉప మండల కన్వీనర్ దివంగత నారాయణరెడ్డి మొక్క జొన్న పంటకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న దివంగత నారాయణరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డి మొక్కజొన్న పొలాన్ని పరిశీలించగా తాను సాగు చేసిన రెండున్నర ఎకరా మొక్కజొన్న పంట కాలిపోయింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, అశోక్ రెడ్డి పొలం వద్దకు వెళ్లి మధుసూధన్‌రెడ్డితో మాట్లాడారు. పంటను దగ్ధం చేసిన రైతుతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆటోను ఢీ కొన్న బైక్ - ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుత్తి-అనంతపురం రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం చింతలచెరువుకు చెందిన రాముడు పనినిమిత్తం గుత్తికి బైక్‌లో వచ్చాడు. తిరిగి వెళ్తుండగా ముందుర వెళుతున్న ఆటోను బైక్ ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన రాముడును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్యపై దాడి

గుత్తి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యపై రోకలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. అంబేడ్కర్ కాలనీలో దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన భర్త భార్యపై రోకలి బండతో దాడి చేశాడు. దాడిలో గాయపడిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సోషల్ మీడియాలో వచ్చిన కథనం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఉగ్ర దాడి అమానుషం


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. ముష్కరుల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. డీఆర్ఎం కార్యాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతి ర్యాలీ నిర్వహించారు. దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోడం బాధకరమన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, ఇతర అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో దైవదాసులు పీవీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనలో బ్రదర్ పీసీ రత్నరాజు ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. అంతకుముందు కాశ్మీరులోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతులైన వారి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు!

- పహరీ కూల్చివేతపై పట్టించుకోని పోలీసులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపన్యాసకులు



పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ కూల్చివేత దృశ్యాలు (ఫైల్)

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ వారం రోజుల క్రితం కొందరు అక్రమంగా కూల్చివేశారు. ఈవిషయంపై ప్రిన్సిపాల్ సుబ్రదమ్మ ఆధ్వర్యంలో కళాశాల ఉపన్యాసకులు రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించిన పాపాన పోలేదు. దీంతో ఈ నెల 25న పామిడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సారథ్యంలో ఉపన్యాసకులు నేరుగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలంటూ పోలీసులకు ఆదేశించారు. పోలీసులు ఎమ్మెల్యే ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. ప్రహరీ కూల్చివేత వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు అన్నచందంగా మారింది. ప్రహరీ కూల్చివేతతతో విద్యార్థులు, మహిళా ఉపన్యాసకుల వ్యక్తిగత మరుగుదొడ్లు బహిర్గతంగా కనిపిస్తున్నాయి. దీంతో మల, మూత్ర విసర్జనకు వెళ్లాలంటే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రహరీ కూల్చివేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అలాగే కళాశాలోని విలువైన విద్యా సామగ్రి చోరీకి గురయ్యే ఆస్కారం లేకపోలేదు. అలాగే మందుబాబులకు కళాశాల ప్రాంగణం బార్ అండ్ రెస్టారెంట్‌గా మారింది. ప్రజాదర్బారులో ఇచ్చిన హామీ మేరకు అక్రమ కూల్చివేతదారునిపై చట్టపరమైన చర్యలు చేపట్టేలా సంబంధితాధికారులను ఎమ్మెల్యే ఆదేశించాల్సిన అవసరమైంతైనా ఉందని ప్రిన్సిపాల్, అధ్యాపకులు కోరుతున్నారు. అలాగే ప్రహరీ పునర్నిర్మించి కళాశాలకు భద్రత కల్పించాలన్నారు.